# ఒక ప్రణయ కథ

**మా**వాడి ప్రణయ కథలో నేను జోక్యం కలిగించుకోకుండా ఉండాలని చాలా ప్రయత్నించాను. కాని సూర్యమే నన్ను బలవంతంగా అందులోకి లాగాడు. నెల రోజులు ఆలోచించి మరీ రాసిన తన ప్రణయ లేఖ చూపించాడు.

"కమలా,

నన్ను వివాహం చేసుకోటానికి నీకేమన్నా అభ్యంతరం ఉందా?

నీకీ ఉత్తరం రాయకుండా ఉండాలని నెల్లాళ్ళనించీ ప్రయత్నిస్తున్నాను. లాభం లేకపోయింది. నిన్ను కోరకుండా ఉండాలని నేను చేసిన ప్రయత్నమంతా వృధా అయిపోయింది.

నన్నే అడిగితే నాకన్న అన్ని విధాలా మంచివాణ్ణీ, అందమైనవాణ్ణీ, ధనికుణ్ణీ, తెలివిగలవాణ్ణీ పెళ్ళాడమని సలహా యిస్తాను–

సూర్యం".

"ఎట్లా ఉంది ఉత్తరం?" అన్నాడు సూర్యం.

నేనాలోచించి, "సీలాగే ఉంది. పోస్టులో వేసి చూడు" అన్నాను.

దానికి వచ్చిన సమాధానం కూడా మావాడు నాకు చూపాడు. నన్నా జవాబు పైకి చదవమన్నాడు.

"సూర్యంగారూ,

మీ ఉత్తరం గురించి ఏమనుకోవాలో నాకు తెలీదు. నన్ను మీరవమానం చేయటానికి ప్రయత్నిస్తున్నట్టు భావిస్తున్నాను. మీరింకా మంచిగా, అందంగా, ధనికులుగా, తెలివిగా లేనందువల్ల మిమ్మల్ని పెళ్ళాడలేను.

.కమలాదేవి."

నేనా ఉత్తరం పూర్తి చెయ్యగానే సూర్యం విరగబడి నవ్వసాగాడు. వాడికి మతి చెడిందని నా కనుమానం తగిలింది. ఎందుచేతనంటే వాడు కమలను ప్రేమించాడు. తన ప్రేమను విమర్శించుకున్నాడు. దాని బలాన్ని పరీక్షించి అది గట్టి ప్రేమేనని నిర్ణయించుకున్నాడు. అట్లాంటి ప్రేమ యిట్లా పరిణమించి నందుకు నాకు విచారమేసింది.

నేను వాడి భుజం తట్టి, "ఫరవాలేదు లేరా, ఓ నెల్లోజుల్లో నువ్వా అమ్మాయిని మరిచిపోతావు– కాస్త ప్రయత్నిస్తే" అన్నాను.

వాడింకా నవ్వసాగాడు.

"ఆ పశువునా?" అన్నాడు నవ్వుతూనే. "దాని కోసం నెల్లోజులు అకారణంగా హైరానా పడ్డాను. చెప్పుతో కొట్టక సముదాయిస్తావేం."

నా గుండెమీది బరువు తీసినట్టయింది.

తరవాత రెండు నెల్లకు కాబోలు కమల వివాహం అయింది. ఆమె భర్త కొత్తగా ఐ.పి.యస్ పరీక్ష పాసయి ఎక్కడో డిప్టీ కలెక్టరుగా ప్రవేశించాడు. చూపులకు దొరల్లేనే ఉంటాడు.

మా సూర్యంలో కలిగిన మార్పు నేను నాలుగైదు రోజుల అనంతరంగాని గమనించలేదు. వాడు ఆహార నిద్రలు విసర్జించాడు. వాడి నవ్వు విని ఎన్నో సంవత్సరాలయినట్టుంది. వాణ్ణి చూస్తేనే భయం వెయ్యసాగింది.

"ఏమిట్రా, సూర్యం?" అన్నాను.

"ఆ కమల–" అన్నాడు.

"ఆ కమల మీద మళ్ళా వ్యామోహం కలిగిందా ఏమిటి?" అన్నా ఆశ్చర్యంతో.

సూర్యం తల అడ్డంగా తిప్పాడు.

"కమల అన్నమాట నిజం. ఆ ఉత్తరం రాసి నే నావిణ్ణి అవమానించాను.

"అప్పట్లో నువ్వట్లా అనుకోలేదే!"

"అప్పటికది అవమానం కాదు. ఈ పెళ్ళి వల్ల అది అవమానంగా పరిణమించింది."

"ఎట్లా?"

"కమల కెటువంటి మొగుడు దొరికాడో చూడు! కమలని ప్రేమించ టానికిగాని ప్రేమించానని చెప్పి ఉండటానికి గాని నాకే మధికారం ఉంది?"

"కమలను పశువన్న వాడివి కాదూ?

"అప్పుడు– నాకు సమాధానం రాసినప్పుడు కమల పశువే!"

సూర్యానికి నిజంగా పిచ్చి ఎత్తిందనే ఇప్పటికే నాకు విశ్వాసం....!

[ముద్రణ : మే 1946, వరప్రసాదం (కథలు)
రెండవ ముద్రణ : యువ బుక్ డిపో, మద్రాసు]